# అతడు జయించాడు

"నమస్కారం మాస్టారూ!"

పిల్లల హెూమ్‌వర్క్ పుస్తకాల్లోంచి తలెత్తి చూశాను.

నల్లగా, బక్కగా చెమట కారుతున్న ముఖంతో ఉన్న యువకుడు!

ఏమిటన్నట్టు చూశాను.

"నన్ను మీ స్కూలుకి వేశార్సార్!" ఉత్తర్వుకాగితాన్నందించాడు.

"కొత్త టీచరువా? బావుంది. ఇక్కడ ఖాళీని భర్తీ చేయడానికి ప్రభుత్వానికి రెండేళ్ళు పట్టిందన్నమాట! విద్యమీద అంతశ్రద్ధ ఉంది. అవునూ, ఏ టౌన్ స్కూలుకో వేయించుకోక ఈ మారుమూల పల్లెలోని మాలపల్లె స్కూలుకి వేయించుకున్నావేం?"

"నాలాగే ఇక్కడి పిల్లలూ విద్యావంతులు కావాలని...."

మిర్రి చూశాను. ఏదో అనుమానం రాగా "రిజర్వేషన్ వాడివా?" అడిగాను.

అతడు మాట్లాడలేదు. అదోలా చూశాడు. తడబట్టం నా వంతయ్యింది.

"అహ... నా ఉద్దేశం ఏమిటంటే గ్రూప్‌వన్ ఉద్యోగాల్లో కూడా మీకు రిజర్వేషన్ సౌకర్యం ఉంది కదా! అవన్నీ వదులుకుని ముష్టి పన్నెండొందల కన్సాలిడేషన్‌పే బడిపంతులుగా చేరడం ఎందుకూ అవటాని అంతే!"

"నిన్నటివరకూ కాన్వెంట్లో వెయ్యి రూపాయలకే పని చేశానండి!"

"సరే. నీకిష్టమయింది. చేరావు. మధ్యన నాకెందుకు దురద గానీ, ఇదిగో పిల్లలూ! ఈయన మీ కొత్త టీచరు. ఒకటి రెండు మూడు క్లాసులకి ఇక మీదట ఈయనే పాఠాలు చెబుతాడు. అన్నట్టు... నీ పేరేవిటోయ్?"

"వియ్యన్న."

"ఇదేం పేరోయ్! సరి సర్లే! పేరు ముఖ్యం కాదు. చదువెలా చెప్పావన్నది ముఖ్యం. పూర్వం ఋషులూ, సద్బ్రాహ్మణులూ విద్యా బోధన చేసేవారు. గురుశిష్యులిద్దరూ కూడా

అదో తపస్సులా భావించేవారు. ఆ కాలమూ పోయింది ఆ చదువులూ పోయాయి. విష్వక్సేనుడు అని పలకలేని వాళ్ళు కూడా ఉపాధ్యాయులే! నిన్ను గురించి అనటం లేదోయ్! లోకం సంగతి చెబుతున్నా. ఇక ఈ పిల్ల రాక్షసులున్నారు చూశావూ... వీళ్లకి చదువులకన్నా ఆటలూ, అల్లరీ ఇష్టం. వీళ్ల తల్లిదండ్రులకేమో వీళ్లని పనిలో ఒంగబెట్టేద్దామన్న ధ్యాసెక్కువ. ఇక చదువేం సాగుతుంది నా మొహం! అందుకే వానాకాలం చదువులైపోయాయి!"

అతడు పిల్లల వంక, వారి దీన ముఖాలవంక, వారి చిరిగిన బట్టలవంక సానుభూతిగా చూస్తున్నాడు. నా ఘోష చెవికెక్కటంలేదని గ్రహించేసరికి సర్రున కోపం వచ్చింది. అయినా ఒకేచోట పని చేయాల్సినవాళ్లం గనుక సరిపుచ్చుకున్నాను.

"జాయినింగు రిపోర్టు రాసిచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం పెట్టు. ఇవాళ అమావాస్య మరి. అభ్యంతరముంటే రేపట్నుంచి పాఠం చెబుదువుగాని!"

"నాకా పట్టింపుల్లేవండీ!"

'అసలే పట్టింపులూ వున్నట్టు లేవులే!' అనుకుంటూ, "సరే, కానీయ్!" అన్నాను.

అతడెల్లి పిల్లల పేర్లూ, వారి కుటుంబ విషయాలూ అడుగుతూ కబుర్లలో పడ్డాడు. నేను పే బిల్ తయారుచేస్తూ కూర్చున్నాను.

లాంగ్ బెల్ కొట్టాక, "సర్పంచి గారి దర్శనం చేసుకొద్దాం రావోయ్!" అన్నాను.

"ఎందుకండీ?"

వింతగా చూస్తూ "అదేం మాట వియ్యన్నా! పట్నంలో వుండొచ్చావు గనుక పల్లెటూరి రాజకీయాలు నీకు తెలీవు. సర్పంచితో మంచిగా ఉండకపోతే ఎండిఓకో, ఎంపిపికో చెప్పి శంకరగిరి మాన్యాలకి తరిమేస్తారు!" అన్నారు.

"పొట్ట చేతబట్టుకొచ్చిన వాడ్ని. ఏ వూరైనా ఒకటే కదండీ! అక్కడా మనుషులుంటారు కదండీ!"

అతగాడి ముదినాపసాని కబుర్లకి మండుకొచ్చింది. పిల్లకాకికి వుండేలు దెబ్బ రుచి తెలీదులే అని సరిపెట్టుకున్నాను.

"నీ మేలు కోరి చెప్పాను. ఆపైన నీ ఇష్టం. నేను రోజూ భీమవరం నుంచి షటిల్ చేస్తూంటాను. మా పిల్లలు అక్కడ చదువుకుంటున్నార్లే. నువ్వూ అక్కడ్నుంచి రావచ్చు. బస్సులు బాగానే వున్నాయి. ఈ పల్లెని ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్నానూ అంటే ఇక్కడే వుండొచ్చుమరి. ఇక్కడా మనుషులున్నారు. వాళ్ళూ బతుకుతున్నారు!" దిమ్మతిరిగేలా మాటల బాణాల్ని సంధించాను.

"ఇక్కడే వుంటాను మాస్టారూ!"

దిమ్మెరపోయాను. "ఇక్కడివాళ్లే ఈ కుగ్రామంలో ఉండలేక పట్నాలు పట్టుకు పోతోంటే పట్నం నుంచొచ్చిన నువ్విక్కడ...!"

చిన్నగా నవ్వుతూ తలాడించాడు.

నా పాతికేళ్ల సర్వీసులో ఇలాటి మొండిఘటాన్ని చూడలేదు. ప్రాథమిక పాఠశాలకైతేనేం ప్రధానోపాధ్యాయుణ్ని. అతడి పైవాడిని. అతడితో వాదాలేంటనిపించి, "నీ ఇష్టమోయ్! నువ్వే గంగలో మునగాలనుకుంటే అందులో మునుగు. ఇవిగో స్కూలు తాళాలు. రేపట్నుంచి టైముకి స్కూలు తెరవడం, శుభ్రం చేయించడం నీ బాధ్యత!" అన్నాను.

ఈలోగా పిల్లలు నా టీవీఎస్ తెచ్చి తుడిచి గుమ్మం ముందు పెట్టారు. స్టార్ట్ చేసి ఇంటిముఖం పట్టాను.

* * *

"ఇదిగోనయ్యా నీ మొదటి జీతం! ఇవాళ నువ్వు పెద్ద పార్టీ ఇవ్వాలి!"

"తీసుకోండి మాస్టారూ!" స్వీట్స్ పాకెట్ మూత తీసి ముందుకి చాపాడు వియ్యన్న.

"ఏర్పాట్లతోనే వచ్చావన్నమాట. గుడ్! ఇన్ని నాకెందుకోయ్!"

"పిల్లలక్కూడానండీ!"

"ఓహో... మంచిదోయ్!"

స్కూలు పిల్లలందరికీ లడ్డూలు పంచిపెట్టాడు. వాళ్లెంతో మురిసిపోయారు.

"ఇవాళ నువ్వింకో మంచి పని చెయ్యాలి. వియ్యన్నా!"

"చెప్పండి, మాస్టారూ!"

"నీకు చెప్పానో లేదో కానీ, నేను ఎల్లయిసీ ఏజెంటుని. నేనంటే మా ఆవిడన్నమాట. మన పేరుమీద అలాటి వ్యాపారాలు చెయ్యకూడదు కదా! అందుకని ఆవిడ పేరుమీద చేస్తూంటాను. మన మండలంలోని ప్రతి టీచరూ నా దగ్గరే పాలసీలు తీసుకుంటూంటారు. చెప్పవోయ్ ఎంతకి చేద్దాం - పదివేలకా, ఇరవైవేలకా?" ఫారాలు తీస్తూ అన్నాను.

"ఇప్పుడెందుకులెండి, తర్వాత తీసుకుంటాను!"

"అమ్మమ్మా! అలా వాయిదా వెయ్యకు. జీవితం బుద్బుదప్రాయం అన్నారు. ఎప్పుడేమవుతుందో ఎవరూ చెప్పలేరు. ఇలా రోడ్డుమీదకి వెళ్లినవాడు అలా శవమై రావొచ్చు. అసలు నన్నడిగితే మనగురించి మనం బతికేది బతుక్కాదు. మనల్ని నమ్మిన

వాళ్ల కోసం బతికేదే అసలైన బతుకు! అంచేత మనం పోయినా, మనల్ని నమ్మిన వాళ్లు బాగుండాలీ అంటే పాలసీ తీసుకోవడం తప్పనిసరి! పెద్దవాణ్ణి.... ఎందుకు చెబుతున్నానో విను!"

"పర్మనెంటయ్యాక తీసుకుంటాన్లెండి!"

"అవ్వకెక్కడికి పోతుందోయ్! ఒక్కసారి ప్రభుత్వోద్యోగంలో చేరితే అతగాణ్ని తీసెయ్యడం బ్రహ్మతరం కూడా కాదు!"

" నా ఉద్దేశం పూర్తి జీతం వచ్చేక అని మాస్టారూ!"

"పోనీ ఇప్పుడో అయిదు వేలకి తీసుకో! మొదటి నెల ప్రీమియం నేను కడతాన్లే!"

"మీరు మరోలా భావించొద్దు. తప్పకుండా మీ దగ్గరే పాలసీ తీసుకుంటాను."

అతడెళ్లిపోయాడు. అతడు మొండిమనిషని మరోసారి తెలిసింది. తననుకున్నదే వేదం అనుకునే ఇతడెలా బాగుపడతాడో అర్థం కాలేదు.

మరి నాల్రోజులదాకా అతనితో సరిగ్గా మాట్లాడలేకపోయాను. అతడంటే ఒకరకమైన ఎలర్జీ ఏర్పడింది.

"మాస్టారూ! పిల్లల దగ్గర టెక్స్టుబుక్స్ లేవు. కొనగల స్తోమతూ లేదెవరికీ. ఎక్కువ ఫ్రీ బుక్స్ కోసం ప్రయత్నించండి!" అన్నాడోరోజున.

"ప్రతిసారీ ప్రయత్నిస్తూనే ఉన్నాను. తెచ్చిస్తూనే ఉన్నానోయ్!"

"క్రితంసారి పదిమందికే ఇచ్చారనీ...అంత క్రితం సారీ..."

"అంటే ఏవిటి నీ ఉద్దేశ్యం? మధ్యన నేను మింగేస్తున్నానంటావా? అంత కర్మ నాకు పట్టలేదు !"

"ఛ! మిమ్మల్నెందుకంటాను మాస్టారూ! మొన్న సెంట్రల్ క్లాసుకెళ్లినప్పుడు ఫ్రీ బుక్కులు వచ్చాయన్నారు. ముందుగానే ఎక్కువ పుస్తకాలకి గట్టిగా ప్రయత్నిస్తే మంచిదని అంటున్నానంతే!"

అంతేనా లేక అంతరార్థమేదైనా ఉందా అని తరచి చూశాను.

ఎంచేతంటే ప్రతిసారీ ఉచిత పంపిణీకి చాలానే పుస్తకాలొస్తున్నా నోరున్న వారి పిల్లలకి మాత్రం ఇచ్చి మిగతావి ఓ కాన్వెంట్లో అమ్మేస్తున్నాను. ఏదో... ఒక నెల పెట్రోలు ఖర్చు వస్తుందని ఆశ. ఇప్పుడా తీగంతా లాగితే పరువుపోద్ది. చూస్తోంటే నా కాళ్లకి బంధం వేసేట్టున్నాడు. ఇతగాడి గురించి కొంచెం సీరియస్‌గా ఆలోచించాలనిపించింది.

"అలాగేనోయ్! అందరికీ పుస్తకాలు లభ్యమయ్యేట్లు ప్రయత్నిస్తాన్లే! ప్రయత్నించడం కాదు, నా పలుకుబడి ఉపయోగించి సాధించుకొస్తాను. కానీ, వియ్యన్నా! పుస్తకాలు పంచి ఆదర్శాలు వల్లిస్తే సరిపోదు. వీళ్లని మార్చాలి. అది జరగాలంటే మరో అంబేద్కర్ పుట్టాలి!" నవ్వాను.

అతడేమీ జవాబివ్వలేదు. ఆ రకంగా అతడి నోరు మూయించగలిగినందుకు ఆనందించకుండా ఉండలేకపోయాను.

నా టేబుల్ మీదున్న అటెండెన్స్ రిజిస్టర్‌ని యథాలాపంగా చేతుల్లోకి తీసుకుని తిరగేసిన వాడినల్లా ఆశ్చర్యాంబుదిలో పీకల్దాకా కూరుకుపోయాను.

వియ్యన్న వచ్చాక అన్ని క్లాసుల అటెండెన్సులోనూ విపరీతమైన అభివృద్ధి కనిపించింది. డ్రాపవుట్స్ లేరు. అంటే మాలపల్లె వాసులకి నచ్చెజెప్పి వారి పిల్లల్ని బడికి పంపేట్లు కృషి చేస్తున్నాడన్నమాట!

మనస్సు చేదుగా అయిపోయింది.

ఉడుకు నెత్తురు కదూ! మొదట్లో ఏదో చేసెయ్యాలన్న ఉబలాటమూ, ఆవేశమూ జాస్తిగా వుంటాయిలే. తర్వాత డిఏ ఎప్పుడు పెరుగుతుందా, ఎన్యుమరేషన్ వర్కు ఎప్పుడేస్తారా అని ఎదురుచూస్తారు. అందునా ఈనాటి కుర్రకారు గురించి చెప్పేదేముంది? సినిమాలూ, క్రికెట్టూ తప్ప ఇంకేదీ పట్టదు కదా!

* * *

ఆదివారం. ఉదయమే రెండూళ్లలోని అరడజను మందిని కలిసి ఓ ఇద్దరిని భీమవరంలో ఇంటి స్థలాలు కొనడానికి ఒప్పించాను.

ఈ రోజుల్లో బతకడానికి జీతాన్నే నమ్ముకుంటే చాలదు కదా! అందుకని ఓ హౌసింగ్ కంపెనీ తాలూకు ప్లాట్స్‌ని అమ్మిపెడుతుంటాను కమీషన్ బాగా ముట్టజెబుతూంటార్లే.

దారిలో ఒకతను కనిపించి, "ఇయాల ఆదోరంగదా! పిల్లగాళ్లని బడికి రమ్మన్నారేంటి సామీ?" అనడిగాడు.

అది వియ్యన్న పనే అని అర్థమైపోయింది. దళితుల్తో కలిసి నామీద కుట్ర పన్నడం లేదు కదా అనిపించిందో క్షణం. వాళ్లతో పూసుకు తిరుగుతున్నాడు. అందరికీ పుస్తకాలిప్పించి ఆ క్రెడిట్ తను కొట్టేశాడు. అంచేత నన్ను ట్రాన్స్‌ఫర్ చేయిస్తే తను హెడ్మాస్టరైపోవచ్చుని... ఏం చెబుతాం పిటీషన్ల కాలం కదా ఇది!

హుటాహుటిన బడికెళ్లాను.

బడి పక్కనున్న దిబ్బమీది పిచ్చిమొక్కల్ని పిల్లలచేత తొలగించి శుద్ధి చేయిస్తున్నాడు వియ్యన్న. వానర సైన్యంతో వారధి కట్టిస్తున్న రాముడు గుర్తొచ్చాడో క్షణం.

"ఏవిటోయ్ వియ్యన్నా! నువ్వు నీ సొంత జన్మభూమి కార్యక్రమం చేబట్టినట్టున్నావే!"

"చిన్న గార్డెన్ పెంచుదామని మాస్టారూ!"

"నీ పిచ్చిగానీ పశువులు ఉంచుతాయా? రెండ్రోజుల్లో నానా ఖంగాళీ చేసెయ్యావూ!"

"కంచె కట్టిస్తున్నాం. తలో రెండ్రూపాయలూ ఇస్తామన్నారు.!"

"మరింకేం, పన్లో పనిగా బడి మొహానికి ఇంత సున్నం కొట్టించకూడదూ?"

"పంచాయితీవారు వెల్ల వేయిస్తామన్నారండీ!"

"ఎవరడిగారేవిటి?"

"ఈ వాడల పెద్దలూ, యువకులూ వెళ్లి సర్పంచిని కలిశారు!"

"అలా చెప్పు! సరేనోయ్! మన బడికి మంచి పేరు తెస్తానంటే నేను మాత్రం వద్దంటానా? అలాగే కానియ్!" వెనుదిరుగుతూ అన్నాను.

ఈసారి జన్మభూమి కార్యక్రమం ప్రకటించినప్పుడు ఈ పనులన్నీ నేను చేయించినట్టు రిపోర్టు పంపితే ఎలా వుంటుందన్న ఊహ వచ్చింది. నేను చేయించినా, నా అసిస్టెంటు చేయించినా ఒకటే గనుక అందులో తప్పులేదనిపించింది. ప్రశంసలూ, ప్రయిజులూ లభించొచ్చు కదా!

❊ ❊ ❊

వియ్యన్న వచ్చినప్పట్నుంచీ నాకు చాలా వెసులుబాటుగా ఉంటోంది. సమయానికి స్కూలుకి వెళ్లితీరాల్సిన అవసరం లేనందునా ఫ్రెంచిలీవు సౌకర్యం ఉన్నందునా నా బయటి కార్యక్రమాలు నిర్విఘ్నంగానూ, లాభసాటిగానూ జరిగిపోతున్నాయి.

నేను నా గొడవల్లో మునిగిపోగా అతడు బడి బాధ్యతనంతా తన భుజాలమీద వేసుకున్నాడని చెప్పాలి. బడిని శుభ్రంగా ఉంచుతున్నాడు. రోజూ పిల్లలచేత ప్రార్థన చేయిస్తున్నాడు. చక్కగా అన్ని తరగతుల వారికీ బోధిస్తున్నాడు. చదువులో వెనకబడ్డ వారికోసం ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నాడు.

నేను స్కూళ్ల ఇన్‌స్పెక్టర్‌నై ఉంటే అతడ్ని తప్పకుండా అభినందించేవాడ్నే! కాని నేను హెడ్మాస్టర్ని. అతడు నా అసిస్టెంటు. నన్ను మించి ఎదిగిపోతోంటే ఎలా సహించగలను? అందుకే వీలు దొరికినప్పుడల్లా చురకలేస్తున్నాను. వ్యంగ్యోక్తులు విసురుతున్నాను.

"మనకిచ్చే జీతాలకి మరీ ఇంతగా ఒళ్లొంచి పని చెయ్యక్కర్లేదోయ్!"

"కాన్వెంట్లో ఇంతకంటే తక్కువ జీతానికి ఇంతకంటే ఎక్కువ పని చేయాల్సి వచ్చేది మాస్టారూ!"

"అది ప్రైవేటు మేనేజ్‌మెంటోయ్! వాళ్లు జలగల్లా పీల్చేస్తారు. అలా ఇక్కడ పీలుస్తానంటే మనం ఊరుకుంటామా? మన ఫెడరేషన్ ఊరుకుంటుందా?"

"అక్కడ పనిచేసేవారికన్నా మనకి సౌకర్యాలెక్కువగా ఉన్నాయి. ఉద్యోగభద్రత ఉంది. అయినా ఫలితాల విషయంలో క్రమశిక్షణ విషయంలో ఇక్కడెంతో హీనంగా ఉంది పరిస్థితి."

"అది ప్రభుత్వ అసమర్థత!"

"లోపం మనలో లేదంటారా?"

"ఉంటే మాత్రం ఎలా ఒప్పుకుంటామోయ్! నువ్వెక్కడో వెర్రిబాగులవాడిలా ఉన్నావే! ఈ దేశానికి ఏం చేశామన్నది కాదు. ఈ దేశం మనకేం చేసిందని ప్రశ్నించాలి. మన వాటా మనం లాక్కోవాలి. అప్పుడే మనకి డిఏలు పెరుగుతాయి. స్పెషల్ గ్రేడులొస్తాయి!"

"క్షమించాలి, నేను మీతో ఏకీభవించను!"

నా ముఖం ఎర్రబడింది. "నువ్వు కమ్యూనిస్టువా?"

నవ్వాడు. "మంచియన్నది మాలయైతే మాలనేయగుదు నేను అన్నాడు గురజాడ. మంచి పనులు చేసేవాళ్లూ చెయ్యాలనే వాళ్లూ కమ్యూనిస్టులూ, నక్సలైట్లూ అయితే నేనూ వాళ్లలోవాడ్నే. కలం కత్తితో సమాజకశ్మలం తొలగించాలని యత్నిస్తోన్న కలం యోధుణ్ని. భావితరానికి మార్గదర్శకుణ్ని. గురువుని."

నా గుండె గుభిల్లుమంది. చూస్తుంటే తీవ్రవాదులతో ఇతడికేవో సంబంధాలున్నట్టే ఉంది. నా మీద వాళ్లకి లేనిపోనివి చెబితే వాళ్లు నామీద కత్తి కడితే..? బాబోయ్!

ఫెడరేషన్ లీడర్లకీ, యండీవోకి ముందే అతడి గురించి చెప్పడం మంచిదనుకుంటూ అన్నాను- "ఉద్యమాలకీ, వాటికీ ప్రభుత్వోద్యోగులు దూరంగా ఉండాలి వియ్యన్నా! కేసు అయితే చాలా గొడవలొస్తాయి. ఉద్యోగం పోయినా పోవచ్చు. జాగ్రత్త!"

అతడు జవాబివ్వలేదు.

* * *

ఉన్న పళాన రమ్మని సర్పంచి దగ్గర్నుంచి కబురొచ్చింది.

చెబుతున్న పాఠానికి మధ్యలో మంగళం పాడేసి పరుగునెళ్లాను.

“ఏమిటి పంతులూ! ఏమిటి విశేషాలు?” ఉయ్యాల బల్లమీద కూర్చుని ఊగుతూ పళ్లు కుట్టుకుంటూ అడిగారాయన. ఊరికి తిరుగులేని నాయకుడాయె!

“మీకు తెలీందేవుంది! బడికి వెల్ల వేయించారు. కప్పు బాగుచేయించారు. కృతజ్ఞతలు చెప్పడానికి నేనే వద్దామనుకుంటున్నాను. ఇంతలో తమరే పిలిచారు...”

“పనులు చేసినోడ్నెవరు గుర్తు పెట్టుకుంటార్లేవయ్యా”

“అమ్మమ్మ! అలాగనకండి. మన ఊరూ వాడా ఈ మాత్రం బాగుపడిందీ అంటే అదంతా మీ చలవే! అందుకే మీకు ఊళ్లో గాలి కూడా ఎదురు వీచలేకపోతోంది!”

“మీ కుర్ర మాస్టారి సంగతేంటి? ఏదేదో వింటున్నాను...”

“కుర్రాడు కదండీ! పైగా అట్టడుగు వర్గం నుంచొచ్చినవాడు. తనవాళ్లకేదో చేసెయ్యాలన్న తాపత్రయం తప్ప మరేమీ లేదండి. మరి నాలుగు రోజుల్లో కాళ్లు లాక్కొచ్చేస్తాయిలెండి!”

“పెద్దోళ్ల కోసం రాత్రి బడి పెట్టేడట! అంతా చదువుకోవాలి. సంతకాలు చెయ్యాలంటున్నాట్ట...!”

నిజంగా నా కది షాకింగ్ న్యూసే! కాని ఆ సంగతి అంగీకరించలేకపోయాను. “ఏదో అప్పుడప్పుడూ నలుగురు వయోజనులకి పాఠాలు చెబుతానూ అంటే సరే అన్నాను. అంతేగానీ...”

“పాఠాలే కాదు, చాలా చెబుతున్నాట్ట! దళితులంతా కలిసుండాలని నూరి పోస్తున్నాట్టగా. ఎక్కడ్నుంచో పొట్ట చేతబట్టుకొచ్చినోళ్లు ఆ సంగతి మరిచి రాజకీయాల్లో తల దూరిస్తే బుర్ర రామకీర్తన పాడిస్తాను. కుర్రమాస్టారికి ఏం చెబుతావో ఏమో ఇక అలాంటివేం వూళ్లో సాగటానికి వీల్లేదు. నా సంగతి తెలుసు కదా! మాజీ సారా కాంట్రాక్టర్ని. నా దారికడ్డొస్తే వెనకాముందూ చూడను!”

“మీరాగ్రహించొద్దు! అతగాడికి నచ్చచెప్పి మీ దారికి తెచ్చే పూచీ నాది!”

స్కూలుకి తిరిగి వస్తూనే వియ్యన్న మీద విరుచుకుపడ్డాను. అతడి వల్ల నాకు చెడ్డ పేరొస్తోందని నా బాధ.

"చూడు, వియ్యన్నా! మనం ఉద్యోగస్తులం. ఉద్యోగస్తుల్లానే ఉండాలి తప్ప, రాజకీయ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించకూడదు. అనవసర విషయాల్లో తల దూరిస్తే మొదటికే మోసం రావచ్చు జాగ్రత్త!"

"నేనంత తప్పుడు పనేంచేశాను మాస్టారూ?"

"రాత్రి పాఠశాలలు నీకెందుకు చెప్పు? అందుకు నీకేమైనా ప్రత్యేక జీతం ఇస్తున్నారా? లేదే!"

"అక్షరాలు దిద్దించడం, విద్యాబుద్ధులు నేర్పడం నా వృత్తికదా!"

"నీదే కాదు. నాదీ అదే వృత్తి కదా! నాలాగా తామరాకుమీది నీటి బొట్టులా ఉండొచ్చుకదా! వియ్యన్నా! సిద్ధాంతాలు వేరు, జీవితం వేరు. వాటిని మన మార్గానికి అడ్డురానివ్వకూడదు. నీ గురించి సర్పంచి ఎంత మండిపడిపోతున్నాడో నీకు తెలీదు..."

"నేను అట్టడుగు వర్గం నుంచి వచ్చాను. కష్టాలు, కన్నీళ్లు, ఛీత్కారాలమధ్య పెరిగాను. అర్ధాకలితో చిరిగిన దుస్తులతో ఎదిగాను. అవమానాలు, అవహేళనలు వ్యంగ్యోక్తులు చవిచూస్తూ ఈ స్థితికొచ్చాను. నాలాగే నా వాళ్ళంతా విద్యావంతులవ్వాలని, ఆర్థికంగా ఉన్నత స్థితికెదగాలని నా తపన. అప్పుడు గానీ వారి సాంఘికబంధనాలు తెగవని నా తాపత్రయం. అందుకే ఆఫీసరు ఉద్యోగాన్ని కూడా కాదని ఈ వృత్తిలోకొచ్చాను. ఇది తప్పంటారా మాస్టారూ?"

"అది నాకు తెలీదు. అవన్నీ తర్కిస్తూ కూర్చునే ఓపికా లేదు. ఇకనుంచి అలాంటివి సాగడానికి వీల్లేదు."

అతడు బదులివ్వలేదు. నా మాట వింటాడన్న నమ్మకమూలేదు. అలాగే జరిగింది కూడా.

ఆ స్కూల్లో ఉండటం క్షేమకరం కాదని ఆ ఊర్నించి ట్రాన్స్‌ఫర్ చేయించేసుకున్నాను. అక్కడనుంచి వచ్చేముందు "పైకి రావాలంటే పెద్దవారి అండదండలు కావాలి కానీ పేదవారి గుండెలూ, దండలూ కాదు!" అని చెప్పి మరీ వచ్చాను. నా మాట విని బాగుపడకపోతాడా అని ఆశ!

***

ఆ తర్వాత జరిగింది కథకాదు చరిత్ర.

సర్పంచ్ రెడ్డిని పంచాయితీ ఎన్నికల్లో ఒక దళితుడు ఓడించాడని తెలిసి ఆ ఊరెళ్లాను.

బడీ,బడి పరిసరాలూ, ఊరూ, మాలపల్లె అన్నీ చిత్రంగా మారిపోయాయి. ప్రతి వాళ్లూ వియ్యన్నని మెచ్చుకునేవారే! నీరాజనాలు పట్టేవారే!

నలభైమంది యువకుల్నిస్తే ఈ దేశపు రూపురేఖల్ని మార్చేస్తానన్న వివేకానందుడి మాటలు గుర్తొచ్చాయి.

తిన్నగా బడికి వెళ్ళి వియ్యన్నని కలిశాను.

అతడిదివరకట్లానే ఉన్నాడు. అతడి నవ్వులోని అమాయకత్వంకూడా అలాగే వుంది.

"నిన్నెలా అభినందించాలో తెలీడం లేదు వియ్యన్నా. నువ్వేమైనా సాధించగలవు. శక్తులు నిండిన యువకుడివి. లోకాన్ని మార్చగల తరం వాడివి!" అంటూ మనస్ఫూర్తిగా అభినందించాను.

"గురువుకి అసలైన అర్థం ఏమిటో చక్కని పాఠంగా చెప్పేవోయ్" అని కూడా అన్నాను.

నేనతడి సహోద్యోగి నైనందుకెంతో గర్వంగా ఉంది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)

**19.4.1999**